## ఈవిఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి



ఈవిఎం గోడౌన్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లా కలెక్టరేట్ సమీపంలోని ఎలక్షన్ ఈవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి నెల వారి పరిశీలనలో భాగంగా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈవిఎం గోడౌన్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. ఎన్నికల సంఘం రూల్స్ ప్రకారం సెక్యూరిటీ నిర్వహించాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్ తదితరులు ఉన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## రెవెన్యూ సర్వేయర్‌పై దాడి.. కేసు నమోదు

**పాపన్నపేట, ఫిబ్రవరి 14, (ప్రభాతవార్త):** వ్యవసాయ భూమిని సర్వే చేసి వస్తున్న రెవెన్యూ సర్వేయర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న అహోబిలం శ్రీనివాస్ మండలంలోని యూసుఫ్‌పేట గ్రామానికి చెందిన ఈరుల మల్లేశంకు చెందిన భూమిని సర్వే చేయడానికి బుధవారం వెళ్లాడు. అక్కడ సర్వే చేసి తిరిగి వస్తున్న క్రమంలో గ్రామంలోని బస్టాండ్ వద్ద అదే గ్రామానికి చెందిన ఎరుపుల శ్రీనివాస్, ఎరుపుల గంగయ్యలు సర్వేయర్ వెళుతున్న వాహనాన్ని ఆపి అసభ్యంగా మాట్లాడుతూ, ముఖంపై దాడి చేశారన్నారు. సర్వేయర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దాడి చేసిన ఇరువురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

## టిజిఐఐసి,రెవెన్యూ,సర్వే అధికారులు సమన్వయంతో భూసేకరణ వేగంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజిఐఐసి)కి కేటాయించిన భూముల భూసేకరణ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం టిజిఐఐసి, రెవెన్యూ, సర్వే అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలాల వారీగా తహశీల్దార్, సర్వే అధికారులకు కేటాయించిన ప్రభుత్వ, పట్టా, అసైన్డ్ భూముల సర్వే విచారణ చేయాలన్నారు. భూ సేకరణ పూర్తి కాగానే భూమి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించుకోవాలని టిజిఐఐసి అధికారులకు తెలిపారు. కొన్ని భూముల వివరాలు పాత విధానంలో ఉన్నందున కొత్త భూ సేకరణ విధాన ప్రకారం పత్రలు తయారు చేసుకోవాలన్నారు. భూసేకరణ డ్రోన్ ద్వారా కొలతలు తీసుకుంటే సులభంగా వేగంగా అవుతుందన్నారు. ఆర్డీఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. టిజిఐఐసి,రెవెన్యూ,సర్వే అధికారులు సమన్వయంతో భూసేకరణ వేగంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీఓలు సదానందం, చంద్రకళ, టిజిఐఐసి జోనల్ మేనేజర్ అనురాధ, డిజిఎం ఉమా మహేశ్వర్, డిఈ జ్యోతి, డిఎం మహేశ్వర్, మండల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే లైన్ పనుల వద్ద రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 14, (ప్రభాతవార్త) :** మండల పరిధిలోని గంగాపూర్ గ్రామ శివారులో 20 మంది రైతులు రైల్వే లైన్ నిర్మాణంలో భూములు కోల్పోయారు. గత ఏడాది నుండి ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా రైల్వేపనులు చేయడం పై నిరసిస్తూ రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఆందోళనకు దిగిన రైతులకు బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు గుండెల్లి వేణు సంఘీభావం ప్రకటించారు. అధికారులు వెంటనే స్పందించి భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. ఈ విషయమై మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించడానికి కృషిచేస్తానని తెలిపారు. భూబాధితులకు నష్టపరిహారం ఇవ్వకుండా పనులు చేపట్టడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో రైతులు రాజయ్య, కొలుపుల రాజయ్య, కొలుపుల రంగయ్య, భూమయ్య, లక్ష్మయ్య, దమ్మయ్య, బుస్స నాగయ, మల్లేశం, ఎర్ర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధువుకు పుస్తెలు, మెట్టెల పంపిణీ

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** వాసవి క్లబ్, వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో శుక్రవారం కోహెడ గ్రామానికి చెందిన నూతన వధువు వివాహ నిమిత్తం పుస్తెలు, మెట్టెలు, చీర, గాజులు అందించారు. కార్యక్రమంలో జిల్లా వైస్ గవర్నర్ మాంకాల నవీన్‌కుమార్, పిఎస్‌టిలు మురంశెట్టి కుమార్, చిగుళ్లపల్లి మంజుల, చిగుళ్లపల్లి సత్యనారాయణ, ధన లక్ష్మీ, బెజగాం రమేష్‌రూప, మర్యాల వీరేశం, పొశెట్టి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు

### జిల్లా సంక్షేమాధికారి లలితాకుమారి

**జోగిపేట, ఫిబ్రవరి 14, (ప్రభాతవార్త):** బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించకూడదని, ఎక్కడైనా బాల్యవివాహాలు చేసినా, జరిపేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా సంక్షేమాధికారి లలితాకుమారి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జోగిపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిషేధంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు నిషేధించబడ్డాయని, ఈ విషయంలో ఇప్పటికీ కొన్నిచోట్ల బాల్యవివాహాలు చేస్తున్నారని అన్నారు. బాల్యవివాహాలు చేయటంవల్ల చాలా అనర్థాలు జరుగుతాయని, చిరు ప్రాయంలో వివాహం చేయటంవల్ల ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తటమేగాక, పుట్టే పిల్లలుకూడా అనారోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ఆడవాళ్లకు సమాన అవకాశాలు కల్పించబడ తున్నాయని, అమ్మాయిలను బాగా చదివించి ఉన్నత విద్యావంతు లుగా తీర్చిదిద్దాలని సూచించారు. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన తరువాతే ఆడపిల్లలకు వివాహం చేయాలని తెలిపారు. జోగిపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపివో మాట్లాడుతూ చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 గురించి వివరించారు. తాలెల్మ పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ సత్యనారాయణ మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే ఆరోగ్యపరమైన నష్టాలను తెలియచేశారు. జోగిపేట ఎస్‌ఐ పాండు మాట్లాడుతూ ఉమెన్ ట్రాఫికింగ్, సైబర్‌క్రైమ్‌ల గురించి తెలిపారు. డిసిపియు అధికారి రత్నం బాల్య వివాహాల నిషేధచట్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సఖి అడ్మిన్ మరియు చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ వారి సేవలను తెలియచేశారు. ఇందులో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, హెల్త్ సూపర్వైజర్లు, డిసిపియు సిబ్బంది, వార్డు ఆఫీసర్లు, పంచాయితీ కార్యదర్శులు, ఐకెపి సిబ్బంది, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.




బాల్య వివాహాలు జరుగకుండా చూస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

# స్థానిక ఎన్నికలు మరింత జాప్యం

*** కుల గణన రీ సర్వేతో చల్లబడిన పొలిటికల్ హిట్ * ప్రభుత్వ నిర్ణయంతో ఆశావాహుల్లో నిరాశ**

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** ఎన్నికలు జరగటం ఖాయం అనుకున్న తరుణంలో మరో విడత కులగణన సర్వే నిర్వహణకు సర్కారు నిర్ణయించడం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులు ప్రకటించడంతో ఒక్కసారిగా ఎన్నికల వాతావరణం చల్లబడింది.మరో విడత రాష్ట్రంలో కులగణన సర్వే ఈనెల 16 నుంచి 28 వరకు చేయనున్నారు. సర్వేలో పాల్గొనని వారు జరగనున్న సర్వేలో పూర్తి సమాచారాన్ని అందజేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకుగాను చట్టబద్ధత వేయాలని ప్రభుత్వం భావించటంతో స్థానిక సమరానికి బ్రేక్ పడింది. జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింప చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. తర్వాత పార్లమెంటులో బిల్లు ఆమోదం కావాల్సి ఉంది. ఈ క్రమంలో కొంత సమయం పట్టే అవకాశం ఉండడంతో స్థానిక ఎన్నికలు మే లేదా జూన్ మాసాల్లో జరగవచ్చని భావిస్తున్నారు. ఎన్నికల ముందు బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలుపుకునేందుకే రిజర్వేషన్లు చట్టబద్ధత కల్పించేందుకు కృషి చేస్తుంది. కాంగ్రెస్ మాత్రం బీసీలకు ఇచ్చిన హామీని నిలుపుకునేందుకు సర్వశక్తుల ప్రయత్నం చేస్తుంది. ఈ క్రమంలోనే బీసీల రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి స్థానిక సమరంలోకి దూకుదామని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తుంది. 42 శాతం దిజర్వేషన్లు స్థానిక సంస్థలకే పరిమితం చేయకుండా విద్య ఉద్యోగ పరంగా రిజర్వేషన్లు అమలు చేసేలా చట్టబద్ధత కల్పించేలా కాంగ్రెస్ ప్రయత్నిస్తుంది. ఈ మేరకు కేంద్రంపై ఒత్తిడితేనుంది. రిజర్వేషన్ల చట్టబద్ధతకు అసెంబ్లీలో బిల్లును ఆమోదించి తమిళనాడు రాష్ట్ర తరహాలో తొమ్మిదో షెడ్యూల్లో ఈ అంశాన్ని పొందుపరచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులతో ఏర్పాటుచేసిన సమావేశంలో జరిగిన చర్చల అనంతరం అభిప్రాయాలను సేకరించిన తర్వాతే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలో జాప్యం జరుగుతుండడంతో కేంద్రం నుంచి గ్రామపంచాయతీలకు రావలసిన నిధులు ఆగిపోయాయి. ఎన్నికల నిర్వహణలో ఆలస్యం అవుతున్న కొద్దీ మరింత భారం పడుతుంది. ఈ నెల 16 నుంచి 28 వరకు మరోసారి జరిగే కులగణన సర్వే మూడు పద్ధతుల్లో వివరాలను నమోదు చేయనున్నారు. టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవచ్చు. మండల కార్యాలయాల్లో ప్రజా పాలన అధికారుల వద్ద ఆన్‌లోన్లో కుటుంబ వివరాల నమోదుకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్‌చేసి చెప్తే అధికారులు ఇళ్లకు వెళ్లి వివరాలు నమోదు చేస్తారు. వివరాలు ఇవ్వని వారికి మరోవిడత కులగణన సర్వే ఎంతగానో ఉపయోగపడుతుంది. కాగా డెడికేటెడ్ కమిషన్ సైతం నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. నివేదిక ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకొని ఎన్నికల సంఘానికి నివేదిక ఇవ్వాలి. ఈ నేపథ్యంలో బీసీలకు 42 రిజర్వేషన్లు కల్పించి చట్టబద్ధత ఇచ్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎన్నికల నిర్వహణకు ఆలస్యం కానుంది. ప్రస్తుతం పరిస్థితులను గమనిస్తే వార్షిక పరీక్షల సీజన్, నడుస్తుంది. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయి.

మార్చి 5 నుండి ఇంటర్ థియరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మరోవైపు పదవ తరగతి ఇంటర్నల్ మార్కుల వెరిఫికేషన్ జరుగుతుంది. మార్చి 21 నుండి 10వ తరగతి వార్షిక పరీక్షలు జరగనున్నాయి.. పరీక్షలు పూర్తయ్యేసరికి ఏప్రిల్ మొదటి వారం అవుతుంది. ఆ తర్వాత మిగిలిన తరగతుల విద్యార్థులకు వార్షిక పరీక్షలు జరుగుతాయి. ఉపాధ్యాయులంతా పరీక్షల నిర్వహణలో బిజీగా ఉంటారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించటం కొంతమేరకు ఇబ్బందిగానే ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మే జూన్ మాసాల్లో ఎన్నికలు నిర్వహించడమే సమంజసమని అంటున్నారు. ఇక కొత్త పాలకవర్గాలు కొలువుతీరే వరకు ప్రత్యేక అధికారుల పాలనే కొనసాగుతుంది.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి



నిత్యావసర వస్తువులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

**చేర్యాల, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి శుక్రవారం చేర్యాల పట్టంతోపాటు మండలంలోని ముస్త్యాల గ్రామంలో విస్తృతంగా పర్యటించి తనిఖీలు నిర్వహించారు. చేర్యాల పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. కిచెన్‌హాల్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్‌లను పరిశీలించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌లో వంట సరుకులను పరిశీలించి పెరిగిన డైట్ చార్జీల ప్రకారం నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే వండి విద్యార్థులకు వడ్డించాలని ప్రిన్సిపల్ పుల్లయ్యను ఆదేశించారు. అలాగే విద్యాలయంలో ప్రహరీ గోడ మరమ్మతులు డార్మెటరీలో కిటికీల రిపేర్లు, రైస్ స్టీమ్ యూనిట్‌లకు ఈడబ్ల్యూఐడిసి ఇంజనీర్ల ద్వారా ప్రతిపాదనలు పంపించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.తహసీల్దార్ కార్యాలయంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా నిర్మాణాలు పూర్తిచేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయ భవన ఆవరణలో నిర్మిస్తున్న ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించి డార్మెటరీ, కిచెన్ హాల్, స్టోర్ రూంలను పరిశీలించారు. డైట్ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని హాస్టల్ అధికారులు రాజయ్య, సత్యనారాయణలను ఆదేశించారు. అలాగే ముస్త్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఆసుపత్రిలోని గదులను పరిశీలించారు.ఆరోగ్య మహిళ తదితర రిజిస్టర్‌లను పరిశీలించి బాలింతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ఫార్మసిలో మెడిసిన్‌ను పరిశీలించారు. ప్రతినెల ఆశ వర్కర్లు ఎఎన్ఎంలతో పిహెచ్‌సి స్థాయి రెవ్యూ మీటింగ్ నిర్వహించాలని ఆదేశించారు.కార్యక్రమంలో తహసీల్దార్ సమీర్‌ఖాన్,ఎంపిడిఓ మహమూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



పోస్ట్‌కార్డ్ సంతకాలు సేకరిస్తున్న లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ప్రతినిదులు

## యార్డుకు వ్యతిరేకంగా 'పోస్ట్‌కార్డ్' ఉద్యమం

**నర్సాపూర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** నర్సాపూర్ అడవి ప్రాంతంలో ప్యారానగర్ శివార్లో నిర్మిస్తున్న డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ జిల్లా కన్వీనర్ నాగేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డ్ గురించి ఏకవాక్య తీర్మానం పోస్ట్‌కార్డు కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం నర్సాపూర్ బస్టాండ్‌లో ఏకవాక్య తీర్మానం పోస్ట్ కార్డ్ కార్యక్రమంలో భాగంగా సంతకాలను సేకరణ జరిగింది. ఈకార్యక్రమానికి సిపిఎం నాయకులు ఏ మల్లేశం, కడారి నాగరాజు, నరసమ్మ, నాగేందర్ గౌడ్, మిర్యాల చంద్రశేఖర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ఏ మల్లేషం మాట్లాడుతూ నర్సాపూర్ అటవీ ప్రాంతంలో డంప్‌యార్డ్ ఏర్పాటు చేస్తే వాతావరణం మొత్తం కాలుష్యమయం అవుతుందన్నారు . దీంతో చెరువు కుంటల్లో నీరంతా కలుషితమై ప్రజలకు ఎన్నో రకాల వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. ఈ డంపింగ్ వ్యర్థాలతో వర్షాకాలంలో చెరువులో చేపలు పట్టడానికి వీలు లేకుండా మత్స్య కార్మికులకు నష్టం కలగడంతో పాటు బట్టలు ఉతుక్కోవడానికి కూడా వీలు లేని పరిస్థితులు చోటు చేసుకుంటాయని అన్నారు.అనంతరం లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ మిరియాల చంద్రశేఖర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కలుషితం చేసే ఈ డంప్‌యార్డ్ కు అనుమతులు ఏ విధంగా ఇచ్చారని ప్రశ్నించారు. పర్యావరణ పరిరక్షణకు పచ్చదనానికి ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు వెచ్చి స్తుండగా ఈ డంప్ యార్డ్ నిర్మాణం చేయడం సరి కాదన్నారు. ప్రభుత్వం వెంటనే నర్సాపూర్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న డంప్ యార్డ్ ను రద్దు చేయాలని వారు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, లోక్ సత్తా నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని రద్దు చేయండి

### మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** గుమ్మడిదలమండలాన్ని మరో లగచర్లగా మార్చవద్దని, ప్రజల నిర్ణయాన్ని గౌరవించి తక్షణమే డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని రద్దుచేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు డిమాండ్ చేశారు.గుమ్మడిదల మండలంలో డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ రైతు జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు ట్రాక్టర్ ట్రాలీలతో నిరసన కార్యక్రమం చేశారు. ఈ నిరసనలో పాల్గొని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు మద్దతు తెలిపారు. ఆయనతోపాటు ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ డంపింగ్ యార్డు వల్ల ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని, గుమ్మడిదల రైతులు బంగారం వంటి పంటలు పండిస్తారని, వారి భూములను మరో లగచర్లగా మార్చవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ప్రభుత్వం ప్రజల అభిప్రాయా లను పక్కన పెట్టి దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమర్జెన్సీ తరహా పాలన అమలు చేస్తున్నారని విమర్శించారు. వంద లాది మందిని అన్యాయంగా అరెస్ట్ చేస్తూ రాత్రికి రాత్రి పనులు మొదలు పెట్టడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల కోరిక మేరకు డంపింగ్ యార్డు నిర్ణయాన్ని వెనక్కి తీసు కోవాలని డిమాండ్ చేశారు. ఎయిర్‌ఫోర్స్ అధికారులు సైతం ఇక్కడ డంపింగ్ యార్డు వద్దని జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారని, హైకోర్టు కూడా రెండుసార్లు పనులు ఆపాలని చెప్పినప్పటికీ ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. అసెంబ్లీ వేదికగా ఈ సమస్యపై పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల నిర్ణయాన్ని గౌరవించి డంపింగ్ యార్డు ఏర్పాటును తక్షణమే రద్దు చేయాలని, లేదంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు చిమ్ముల జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, కొలాన్ బాల్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, మాజీ జెడ్పిటిసి కుమార్‌గౌడ్ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, రాజేష్, నరసింహారెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి సంతోష్ రెడ్డి, సదానంద రెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకులు, జేఏసీ నాయకులు, రైతు సంఘాల నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకుందాం

### -బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**కంది, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** ఉమ్మడి కరీంనగర్, అదిలాబాద్, మెదక్, నిజాంబాద్ బిజెపి పట్టభద్రుల, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ అభ్యర్థులు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్కా కోమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి శాసన మండలి మెట్లు ఎక్కేలా ఆశీర్వదించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి కిషన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కంది మండలంలోని ఎల్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో ఓటర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు.సమావేశానికి కిషన్‌రెడ్డి, మెదక్ ఎంపి రఘునందన్‌రావులు ముఖ్యఅతిథిగా హాజరై ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ బిజెపి అభ్యర్థులను బలపర్చాలని, అందుకు పార్టీ నాయకులు తమ వంతు కృషి సల్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపి బిబి పాటిల్, బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, ఆయా మోర్చాల నాయకులు, గ్రాడ్యూఏట్ మేధావులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన నేతలు

### డంపింగ్‌యార్డు ఏర్పాటును నిలివేయాలని వినతి



కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న కొత్తపల్లి, నల్లవల్లి గ్రామాల నేతలు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 14 ప్రభాతవవార్త:** మండలంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటును ప్రజలు ఎంతగా వ్యతిరేకిస్తున్నారో ఎమ్మెల్సీ కోదండరాంకు శుక్రవారం కొత్తపల్లి, నల్లవల్లి గ్రామాల నాయకులు, ప్రజలు ఆయన కార్యాలయంలో కలిసి డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా సహకారం అందించాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం స్పందిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎలాంటి ప్రాజెక్టునైనా మరోమారు ప్రభుత్వం పునఃపరిశీలించి ఏర్పాటు చేయాలని సూచించారు. తమ సిబ్బందిని పంపించి అక్కడ జరుగుతున్న వ్యవహారాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక వచ్చిన తరువాత ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతానని హామీ ఇచ్చారని మాజీ ఉప సర్పంచ్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్ గౌడ్, శ్రీనివాస్, సురేష్, రామకృష్ణ, శేఖర్, రాజుగౌడ్, చంద్రయ్య, ప్రభు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా అధికారి

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని న్యాల్‌కల్‌లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సోమేశ్వరరావు తహసీల్దార్ భూపాల్‌తో కలిసి పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందులు కల్గకుండా తగు చర్యలు తీసుకోవాలని సోమేశ్వరరావు అధికారులను ఆదేశించారు.ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్యామ్‌రావు, ఇంచార్జి పంచాయతీ కార్యదర్శి ధనరాజ్, ఎఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన అధికారి సోమేశ్వరరావు

## ముత్తంగిలో చిన్నారిపై వీధి కుక్కలు దాడి

### చిన్నారిని లాకెళ్లే ప్రయత్నాన్ని అడ్డుకున్న స్థానికులు

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** తెల్లాపూర్‌మున్సిపాలిటీ ముత్తంగి గ్రామ పరిధిలోని న్యూటౌన్ కాలనీలో ఐదేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా కరిచాయి. అన్ని కుక్కలు కలిసి అతడిని లాకెళ్లే ప్రయత్నాన్ని స్థానికులు అడ్డుకున్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి గ్రామంలో న్యూటౌన్ కాలనీలో కాలనీలో ఖమ్రుద్దీన్ కుటుంబంతో పాటు నివసిస్తున్నాడు. సాయంత్రం సమయంలో అతడి కుమారుడు ఉస్మాన్‌కాలనీలో ఇంటిముందు ఆడుకుంటున్న సమయంలో ఐదు వీధి కుక్కలు అతడిపై దాడి చేసి తీవ్రంగా కరిచాయి. రక్తసిక్తమైన చిన్నారిని వీధికుక్కలు లాక్కెళ్లే ప్రయత్నం చేశాయి. పిల్లవాడి అరుపులు విన్న స్థానికులు తక్షణం స్పందించి కుక్కలను అక్కడినుంచి తరిమారు. ఉస్మాన్‌కు వీపుపై, చేతిపై, నడుముపై కుక్కలు కరిచి రక్తం కారుతున్నది. కుటుంబ సభ్యులు వెంటనే ఉస్మాన్‌ను ప్రైవేటు దవాఖానాకు తరలించి చికిత్సను అందజేస్తున్నారు. న్యూటౌన్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ముందు, పల్లే ప్రకృతివనంలో, నీటి ట్యాంక్ వద్ద పెద్దఎత్తున కుక్కలు నివసిస్తున్నాయి. తరచుగా అంగన్‌వాడీ పిల్లలపైనను కుక్కలు దాడి చేస్తున్నాయని కాలనీవాసులు పేర్కొన్నారు. కుక్కలను నియంత్రించడంలో అధికారులు విఫలం చెందారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

### -హత్య చేశారని కుటుంబీకుల ఆందోళన

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సీతానగర్ గ్రామ శివారులో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం...మండల పరిధిలోని కాయిదాంపల్లి గ్రామానికి చెందిన ముసిరిగారి మల్లయ్య గురువారం ఉదయం ఇంటి నుంచి సైకిల్‌పై వెళ్లి మధ్యాహ్నం అల్లాదుర్గం చౌరస్తా పరిసరాల్లో ఉన్నట్లు తెలిపారన్నారు. సైకిల్‌ను పోలీసు ఠాణా పరిసరాల్లో ఉంచి ఆటోలో ఎక్కినట్లు తెలిపారు. శుక్రవారం మల్లయ్య మృతి చెందినట్లు తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీం, జాగిలాల సహాయంతో వివరాలు సేకరించినట్లు ఎస్ఐ ప్రవీన్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. సిసి కెమెరాల పుటేజీలను పరిశీలించి కేసును వెంటనే చేదిస్తామని ఎస్ఐ పేర్కొన్నారు.

# సికింద్రాబాద్ ప్రధాన భవనం కూల్చివేత

## -రూ. 720 కోట్లతో అత్యాధునిక స్టేషన్ -శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ శర వేగంగా జరుగుతున్న అభివృద్ధిలో భాగంగా జంట నగరాలలో ఒకటైన సికింద్రాబాద్ నగరానికి తలమానికంగా ఉన్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రధాన భవనాన్ని కూల్చివేశారు. అత్యంత అధునాతనంగా నిర్మిస్తున్న క్రమంలో అధికారులు రైల్వేస్టేషన్‌కు కిరీటంగా ఉన్న భవనం నేలమట్టం చేశారు. సంస్కృతి ఉట్టిపడేలా ఉన్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ భవనం చరిత్రగానే నిలువనుంది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చరిత్రపుటను ఒకసారి తెరిచి చూస్తే అప్పటి నిజాం నవాబు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను 1874లో నిర్మించారు. అప్పటి నుంచి 1916వరకు నిజాం గ్యారెంటెడ్ స్టేట్ రైల్వేకు ఇదే ప్రధాన రైల్వేస్టేషన్‌గా ఉండింది. తరువాత 1951లో దీన్ని జాతీయం చేయడంతో ఇండియన్ రైల్వేలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కూడా భాగమైంది. 1952 సంవత్సరంలో సికింద్రాబాద్ ప్రధాన రైల్వేస్టేషన్ భవనాన్ని నాటి ప్రభుత్వం నిర్మించింది. దీని పోర్టికో నిజాం అర్కిటెక్చర్‌కు అనుగుణంగా కోటను పోలి ఉంటుందంటారు. తాజాగా దీన్ని కూల్చివేసి అత్యాధునిక రైల్వేస్టేషన్‌ను నిర్మించడం కోసం కూల్చివేయాల్సి వచ్చింది.

**విమానాశ్రాలతో పోటీ పడేలా....**

దాదాపు రూ. 720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను విమానాశ్రయాలతో పోటీ పడే విధంగా అధునీకరించనున్నారు. దీంట్లో ప్రపంచస్థాయి మౌళిక వసతులు, సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఇటు సౌత్‌వైపు, అటు నార్త్‌వైపు జీప్లస్3 అంతస్థులతో స్టేషన్ భవనాలను నిర్మిస్తున్నారు. అంతే కాకుండా ప్రస్తుతం ఉన్నట్లుగానే అధునాతనంగా నిర్మిస్తున్న స్టేషన్‌లో కూడా రిటైల్ దుకాణాలు, భోజనశాలలు అందుబాటులో ఉంటాయి. అలాగే కొన్ని సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన ఎస్కలేటర్‌లాగే ఈ నిర్మాణంలో 32 ఎస్కలేటర్‌లు, 26 లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు లోనికి వచ్చేందుకు రెండు నగక మార్గాలు, రెండు ఫుట్ బ్రిడ్జిలు ఉండనున్నాయి. దీంతోపాటు ఒక స్కైవేను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న మార్గంలోనే సికింద్రాబాద్ మెట్రోస్టేషన్‌కు మార్గాలు ఉండనున్నాయి. ప్రస్తుతం నిర్మిస్తున్న రైల్వేస్టేషన్ పార్కింగ్ ఏరియాను కూడా సౌకర్యవంతంగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు ప్రయాణికులకు అవసరమైన నీటి వసతి కూడా ఎలాంటి లోటు లేకుండా సరిపడా నిలువలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. దాదాపు 400 కార్లు నిలిపేలా గణేష్ టెంపుల్ సమీపంలో పార్కింగ్ సౌకర్యం ఉంటుంది. ప్రస్తు రిజర్వేషన్ కార్యాలయం వద్ద దాదాపు అండర్‌గ్రౌండ్ వాటర్ సంప్‌లు ఏర్పాటు చేయనుండడంతో పాటు రైలులైటింగ్ ఏరియాలో సమీపంలో రెండులక్షల లీటర్‌ల వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. అలాగే గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రయాణికుల పికప్, డ్రాప్ జోన్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి.

# ఉప్పల్ స్టేడియంలో సెలబ్రిటి క్రికెట్ లీగ్ సందడి..!

## -స్టేడియంలో పటిష్ట ఏర్పాట్లు - ప్రేక్షకుల లేక వెలవెల




ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో సెలబ్రిటీ క్రికెట్ మ్యాచ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న సిపి సుధీర్‌బాబు తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నేటి నుంచి రెండు రోజుల పాటు 11వ ఎడిషన్ సెలబ్రిటి క్రికెట్ లీగ్ -2025 టీ20 మ్యాచ్‌ల సందడి నెలకొంది. స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్ ఏర్పాట్లను శుక్రవారం రాచకొండ సిపి సుధీర్‌బాబు పరిశీలించారు. మ్యాచ్ సందర్భంగా స్టేడియంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. స్టేడియంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు సిపి సుధీర్‌బాబు తెలిపారు. స్టేడియంలో మ్యాచ్ చూసేందుకు వచ్చే ప్రేక్షకులకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ పథకం ప్రమోట్ చేస్తూ ఏర్పాటు చేసిన హోర్డింగ్ మీద సిపి సంతకం చేశారు. కాగా ఉదయం నుంచి జరిగిన ఈ మ్యాచ్‌కు ప్రేక్షకుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. తక్కువ సంఖ్యలోనే ప్రేక్షకుల హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. మ్యాచ్ పాసులు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి

## -ఎమ్మెల్యే శ్రీగణేష్



డ్రైన్ వాటర్, సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేష్, కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే 10 వేల కోట్ల రూపాయల వ్యయంతో గ్రేటర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఇందులో మోండా డివిజన్ అభివృద్ధికి 4 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని గురుద్వార్ దేవాలయ సమీపంలో 37 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ మురుగునీటి కాలువ, సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఎంపీ ఈటెల రాజేందర్, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యలతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్‌లోనే 8 వార్డులు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండడం వల్ల అభివృద్ధి పనులు జరగలేక పోతున్నాయన్నారు. కేంద్రం నుంచి రావాల్సిని సర్వీస్ ఛార్జీ కూడా రావడం లేదన్నారు. అ 8 వార్డులను జిహెచ్‌ఎంసిలో విలీనం చేస్తే కనీ, వినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ప్రత్యేక నిధులు వెచ్చించిందన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్‌లోని కంటోన్మెంట్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కార్పోరేటర్ కొంతం దీపిక మాట్లాడుతూ మోండా డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి జిహెచ్‌ఎంసి కమిషనర్ దృష్టికి తేవడంతోనే జనరల్ బడ్జెట్ కింద అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు చిర్రబోయిన సంతోష్ యాదవ్, అల్లాడి గౌరి శంకర్, నందికంటి రవి, బిజెపి నేతలు పిట్ల నాగేష్, కొంతం నరేశ్, తదితరులు పాల్గొన్నారు. జీతూ గుప్త, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

## - రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

## - మణికొండలో రూ.5.కోట్ల 50.లక్షల పనులు ప్రారంభం



మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రూ.5కోట్ల 50.లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీలో మౌళిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రూ.5.కోట్ల 50.లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను కమీషనర్ ప్రదీప్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలోని నెక్‌నాంపూర్, పుప్పాలగూడ, నెమలీనగర్‌లలో బస్తీ దవాఖానాలు ప్రారంభించారు. 4,8,18.వార్డులలో కాళోజి పార్కు, కేపీఆర్ పార్కు, అబ్దుల్ కలాం పార్కులలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. అలాగే పుప్పాలగూడలో భూగర్భ డ్రైనేజి పనులు, సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేస్తామని, ఆ తరువాత ప్రజల సమస్యలను పరిష్కరించడంపైనే దృష్టి పెడుతామని స్పష్టం చేశారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తుండడం వల్లనే వరుసగా నాలుగోమారు రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు కొండకళ్ల రామకృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణుగౌడ్, బుద్ధోలు శ్రీరాములు, పద్మారావ్, రాము పాల్గొన్నారు.

## రమణీయం జనరంజకం సనాతన ప్రేమకథ సీతాయణం



సీతాయణంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** అశోకవనంలో శోకరహితంగా రామ ఆగమనాన్ని అభిలషించే సీతమ్మ అనుక్షణం గత స్మృతుల్లోకి వెళుతూ అడవిలో సంచరిస్తూ తన రాముని ప్రేమను ఆస్వాదిస్తూ ఇప్పుడు లంకలో అనుభవిస్తున్న జీవన విధానాన్ని సరికొత్తరకంగా, స్ఫూర్తికరంగా, సంపూర్తికరంగా, నవనారి జీవనాదర్శకంగా సీతమ్మ ప్రేమతత్వానికి నిదర్శనం సనాతన ప్రేమకథ భానుమతి నరసింహన్ విరచించిన సీతాయణం రమణీయం, జనరంజకంగా సాగింది. శ్రీమాత కల్చరల్ ట్రస్ట్ సమారంభ వేడుకను పురస్కరించుకొని కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో శుక్రవారం రాత్రి బ్నిం రచన; క్రాంతి నారాయణ దర్శకత్వం; ఫణి నారాయణ సంగీత దర్శకత్వంలో రూపొందిన సీతాయణం నటీనటుల అద్భుత నటనకు దర్పణంపట్టి సభికులను సంభ్రమాశ్చర్యపరిచి రామాయణాన్ని తలపింపజేసింది. ఈ కార్యక్రమానికి పటేల్ రమేష్‌రెడ్డి, డా. ఎల్.వి.గంగాధర శాస్త్రి, బ్నిం, క్రాంతి నారాయణ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొని జ్యోతిప్రకాసనంచేసి శ్రీమాత కల్చరల్ ట్రస్ట్‌ను లాంఛనంగా ప్రారంభించిన సీతాయణంలోని నటీనటులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

# స్కూటీలో తరలిస్తున్న 500 గ్రాముల గంజాయి స్వాధీనం

**గచ్చిబౌలి, ఫి బ్రవరి 14 ప్రభాతవార్త**

స్కూటీలో తరలిస్తున్న 500 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజేంద్రనగర్‌కు చెందిన గణేష్‌సింగ్ అనే వ్యక్తి శుక్రవారం ఉదయం తన స్కూటీ వాహనంలో 500 గ్రాముల గంజాయిని తీసుకొని ఖాజాగూడకు వచ్చాడు. సదరు గంజాయిని వి.మహేష్, రవికుమార్ అనే వ్యక్తులకు విక్రయించేందుకు ఖాజాగూడకు తీసుకువచ్చాడు. కాగా ఖాజాగూడలో వాహనాల తనిఖీ చేస్తున్న రాయదుర్గం పోలీసులు అనుమానస్పదంగా కనిపించిన గణేష్‌సింగ్‌ను అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఖాజాగూడలోనే ఉన్న కస్తమర్లు మహేష్, రవికుమార్‌లను సైతం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు గణేష్‌సింగ్‌కు గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు విక్రయించారు అనే కోణంలో విచారణ చేపడుతున్నారు.

## మంచినీటి సమస్యను పరిష్కరించాలని బిఆర్‌ఎస్ వినతి

**నార్సింగి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :**

బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో నెలకొన్న నీటి సమస్య ను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బిఆర్‌ఎస్ అధ్యక్షులు రావులకోళ్ల నాగరాజు నేతృత్వంలో జల మండలి అధికారికి వినతిపత్రి ఇచ్చారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో ఎప్పుడూ నీటి కొరత ఏర్పడ లేదని, కాంగ్రెస్ హయాంలో వేసవి ప్రారంభంలోనే తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. ఇంకా శివరాత్రి కూడా రాలేదని, అప్పు డే బండ్లగూడ కార్పోరేషన్ పరిధిలోని మాధవీనగర్, పిజికాల నీల్లో నీటి ఎద్దడి ప్రారంభమైందన్నారు. ఇళ్లల్లో వేసుకున్న బోర్లు ఎండిపోయాయని, ప్రజలు వాటర్ ట్యాంకర్లను కొని వాడుకుం టున్నారని తెలిపారు. ఇటీవలనే హిమాయత్ సాగర్ జలాలను సరఫరా చేస్తామని నేతలు హడావుడి చేశారని, అటు కృష్ణా, గోదావరి, మంజీరా నీరు రావడం లేదని, ఇటు హిమాయత్ సాగర్ నీరు కూడా రావడం లేదన్నారు. మాజీ సీఎం కేసిఆర్ మిషన్ భగరీథతో ఇంటింటికి నల్లా కనెక్షన్ ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూశారన్నారు. ఇప్పుడు పది రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తే ఎలా ప్రజ లు బతుకుతారని నాగరాజు ప్రశ్నించారు. కాంగ్రెస్ వచ్చినప్పుడల్లా ప్రజల కష్టాలు వస్తాయని మరోమారు రుజువు అవుతుం దన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులుగాని, పాలకులు గాని స్పందించి బండ్లగూడ కార్పోరేషన్‌లో కనీసం రెండు రోజులకు ఒకసారైనా నీటిని సరఫరా చేయాలని నాగరాజు డిమాండ్ చేశారు.

## నిజాం కళాశాలలో సైనికులకు ఘనంగా నివాళి

**సైఫాబాద్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:**

పుల్వామా దాడిలో ప్రాణాలను కోల్పోయిన సైనికులకు శుక్రవారం నిజాం కళాశాలలో ఘనంగా నివాళి కార్యక్రమం జరిగింది. సరిగ్గా ఐదు సంవత్సరాల (2019) క్రితం ఒక ఆత్మహత్యా బాంబర్ జమ్ము-శ్రీనగర్ నేషనల్ హైవేపై 2,500లకు పైగా సైనికులతో కూడిన 78 వాహనాల కాన్వాయిని లక్ష్యంగా పెట్టారు. ఇందులో 40 సిఆర్‌పిఎఫ్ ఉద్యోగులు ప్రాణాలను కోల్పోయారు. చాలా మంది గాయాలకు గురైనారు. ఈ సంద ర్భంగా కాలేజీ ప్రాంగణంలో కళాశాల ప్రిన్సిపల్ ఎ.వి.రాజశేఖర్ మాట్లాడుతూ మన సైనికుల వీరత్వానికి, వారు మనదేశాన్ని రక్షించేందుకు, దేశ ప్రజలను కాపాడేందుకు నిరంతరం పోరాడు తున్నారని కొనియాడారు.

# హాజరు పేరుతో..అవినీతి దందా..!

**-ఉపకార వేతనాలకు కొర్రీ**
**-పరీక్షలకు అనర్హులంటూ ప్రకటన**
**-డబ్బులు తీసుకుని అనుమతిస్తున్న కళాశాలలు**




**హైదరాబాద్, ఫి బ్రవరి 14, ప్రభాతవార్త:** విద్యాప్రమాణాలు పెంచేందుకు తప్పనిసరిగా హాజరు అవసరమని విద్యాశాఖ తీసుకున్న నిర్ణయం..కొన్ని కళాశాలల పాలిట ఆదాయ వనరుగా మారింది. కళాశాలలో ఆధ్యాపకులను భర్తీ చేయకుండా, మౌలిక వసతులు సమకూర్చకుండా విద్యార్థుల వచ్చి ఏమ లాభమని పలువురు విద్యార రంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా ఎక్కువ కళాశాలల్లో చాలా సబ్జెక్టులలో భోదకులే లేరు. ఉన్నకొద్ది మంది ఇతర పనుల్లో నిమగ్నమైపోయారు.కొందరు మాత్రమే తరగతి గదికి వెళ్లి అప్పుడప్పుడు భోదిస్తున్నారు. ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకుహాజరు 75శాతం తప్పనిసరిగా ఉండాలని నిబంధన పెట్టారు. అప్పుడే పరీక్షలకు అర్హులని విశ్వవిద్యాలయాలు ఇటీవల ఆదేశాలు జారీ చేశాయి. అనుబంధ కళాశాలలు వాటిన అమలు చేస్తున్నాయి. ఇప్పటికే చాలా కళాశాలలలో బయోమెంట్రిక్ అమర్చుకున్నాయి. కొన్ని కళాశాలలను మాత్రం ఈవిధానాన్ని వ్యతిరేకిస్తూ పరికరాలను సమకూర్చుకోలేదు. 2017లోనే పిజి కోర్సులకు బయోమెంట్రీక్ విధానాన్ని జెఎన్‌టీయూహెచ్ అమలులోకి తీసుకువచ్చింది. ఇదే విధానాన్ని యూజీ కోర్సులకు అమలు చేస్తుంది. పలు విద్యాలయాల్లో విద్యార్థులకు ఇప్పటికీ హాజరుపట్టీల విధానాన్ని అమలు చేస్తున్నారు.. 75శాతం హాజరులేని వారి నుండి ఇచ్చినంతగా కొన్ని కళాశాలలు దండుకుంటున్నాయి. హాజరు తక్కువ శాతాన్ని బట్టి మరింత ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నట్లు పలవురు విద్యార్థులు విమర్శిస్తున్నారు.

హాజరు తక్కువ వచ్చిందనే కారణాన్ని చూపించి ఉపకార వేతనాలు, ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాలను విద్యార్థులకు దూరం చేస్తున్నారు. 75శాతం హాజరుకాలేదని, ఉపకార వేతనం, ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకానికి అనర్హులంటూ నగరంలోని కొన్ని కళాశాలలకు విద్యార్థులకు వివరిస్తున్నాయి. ఫీజు సాయం అందకపోతే ఈకోర్సులు చదవలేమని నిరుపేద కుటుంబాల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కొందరైతే మధ్యలోనే మానేస్తున్నారు. ఒక్కొక్క ఏడాదికి ముప్పైవేలకు పైగా సొంతంగా కట్టుకోవాల్సి వస్తుందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. గ్రేటర్ పరిధిలోని కొన్ని డిగ్రీ, ఇంజీనీరింగ్ కళాశాలల్లో ఉదయం నుండి సాయంత్రం వరకు ఒక్కరోజుకూడా తరగతులు పూర్తిగా జరిగిన సందర్భాలే ఉండటం లేదు. ఉదయం ఒకటి రెండు తరగతులు మాత్రమే జరుగుతున్నాయి. ఉస్మానియా, జెఎన్‌టియూహెచ్, తెలుగు యూనివర్సిటీ తోపాటు వీటి అనుంధ గుర్తింపుతో వేలాది కళాశాలలు నడుస్తున్నాయి. వీటిల్లో చాలావరకు కళాశాలల్లో పర్తిస్థాయిలో అధ్యాపకులే లేదు ఉన్నవారితో ఒకటిరెండు తరగతులు మాత్రమే జరుగుతునాన్నయి. ఈ మాత్రం దానికి దూర ప్రాంతాలనుండి నుండి కళాశాలకు రావాలా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత రోజుల్లో తరగతి గదుల అవసరం తగ్గిందన్నారు. దీనిని గుర్తించకుండా దూర ప్రాంతాల్లోని విద్యాసంస్థలకు నిత్యం రావాలనే నింధన ఎవరికి ఉపయోగం అని నిలదీస్తున్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణతకు అవసరమైన విజ్ఞానాన్ని తరగతి గదుల్లోనే నేర్చుకోవాల్సిన అవసరం లేదని, నిపుణుల బోధనలు ట్యుటోరియల్స్ అందుబాటులో ఉన్నాయని వివరిస్తున్నారు.

బయోమెంట్రీక్ హాజరు అడ్డుకపెట్టుకుని కొన్ని కళాశాలలు అవినీతికి పాల్పడతున్నాయని పలువురు విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

# కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన గూగుల్ ఇండియా బృందం




**పంజగుట్ట, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త):** గూగుల్ ఇండియా ప్రతినిధుల బృందం తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ని సందర్శించి, ప్రస్తుత ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను అధ్యయనం చేయడంతో పాటు, గూగుల్ యొక్క అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలను వినియోగించి దీని కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి మార్గాలను అన్వేషించింది. ఇటీవల గూగుల్ , తెలంగాణ ప్రభుత్వం మధ్య కీలక రంగాలలో టెక్నాలజీ ఆధారిత వినియోగం పై కుదిరిన అవగాహన ఒప్పందం నేపథ్యంలో ఈ బృందం సందర్శించింది. ఈ ప్రతినిధి బృందంలో గూగుల్ డీప్ మైండ్ వైస్ ప్రెసిడెంట్ చందు తోట, గూగుల్ క్లౌడ్ వైస్ ప్రెసిడెంట్ రావు సూరపనేని, గూగుల్ కస్టమర్ సొల్యూషన్స్ కంట్రీ మేనేజర్ శాలిని పుచ్చలపల్లి, గూగుల్ డీప్ మైండ్ సీనియర్ డైరెక్టర్ శేష అజ్జరపు ఉన్నారు. వీరితో పాటు గవర్నమెంట్ అఫైర్స్ పబ్లిక్ పాలసీ హెడ్ రాజేశ్ రంజన్, గవర్నమెంట్ అఫైర్స్ పబ్లిక్ పాలసీ ప్రతినిధి శ్రీనివాస్ కొడాలి హాజరయ్యారు. నగర పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కార్యకలాపాలపై సమగ్రమైన ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో రియల్‌టైమ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఎలా నిర్వహించబడుతోందో, అధునాతన నిఘా వ్యవస్థలు, డేటా అనలిటిక్స్, గూగుల్ మ్యాప్స్ డేటాను అనుసంధానం చేయడం ద్వారా ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను గుర్తించడం వంటి అంశాలను వివరించారు. గూగుల్ ప్రతినిధులు, పోలీస్ కమిషనర్ ఆనంద్ బృందం మధ్య చర్చలు ప్రధానంగా గూగుల్ మ్యాప్స్ యొక్క లైవ్ ట్రాఫిక్ డేటాను తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్కి అనుసంధానం చేయడం, వాహనాల స్థితిని ఆధారంగా చేసుకొని ఆటోమేటెడ్ ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను అభివృద్ధి చేయడం, రియల్‌టైమ్‌లో గస్తీ వాహనాల ట్రాకింగ్, ట్రాఫిక్ పర్యవేక్షణ కోసం డ్రోన్ నిఘా అమలు వంటి అంశాలపై జరిగాయి. ప్రస్తుత ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చడానికి అనేక వ్యూహాలను ప్రతినిధులు పరిశీలించారు. గూగుల్ నిపుణులు, సెంటర్ కార్యకలాపాలను మెరుగుపర్చేందుకు క్లౌడ్ పరిష్కారాలను ఉపయోగించడం, కొత్త అప్లికేషన్‌లను ప్రవేశపెట్టడం వంటి విషయాలపై విలువైన సూచనలు అందించారు. అలాగే, ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సాంకేతికత ఆధారిత పరిపాలనను అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వ నిబద్ధతను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో సహకారం కొనసాగించేందుకు గూగుల్ ప్రతినిధులు అంగీకరించారు. ఈ భాగస్వామ్యం అధునాతన ట్రాఫిక్ నిర్వహణ కోసం ఎంతో మేలు చేస్తుంది. సీసీ టీవీ ఫుటేజ్ డేటాను క్లౌడ్‌లోసేవ్ చేయడం ద్వారా 30 రోజుల పరిమితిని అధిగమించటం, అవసరమైన సందర్భాల్లో ఎ.ఐ సాయంతో త్వరితగతిన అవసరమైన డేటాను తిరిగి పొందడం వంటి మెరుగైన మార్గాలను కూడా ప్రతినిధులు సూచించారు.

ఈ సమావేశానికి అదనపు సీపీ(ట్రాఫిక్) పి. విశ్వ ప్రసాద్ , జాయింట్ సీపీ (అడ్మిన్) జె. పరిమళ హాన నూతన్ , పుష్ప, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్..!

## -తగ్గిన చికెన్ అమ్మకాలు -మటన్, చేపలకు పెరిగిన గిరాకీ



**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ భయాందోళన కలిగిస్తోంది. కోళ్లకు వైరస్ సోకి పెద్ద ఎత్తున మృత్యువాత పడుతుండటంతో.. జనాలు చికెన్ తినేందుకు భయపడుతున్నారు. బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ ధరలు కూడా భారీగా తగ్గిపోయాయి. కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.210లు, విత్ స్కిన్ కిలో రూ.190 చొప్పున ధరలు పడిపోయినా కొనుగోలుదారులు ఆసక్తి చూప డంలేదు. చికెన్ అమ్మకాలపై బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ భారీగా పడింది. బర్డ్ ఫ్లూపై సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అవుతున్న నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో సగానికి పైగా చికెన్ అమ్మకాలు తగ్గాయి. నగరంలో నిత్యం దాదా పుగా 6 లక్షల కిలోల చికెన్ అమ్మకాలు జరుగుతాయి. గత 23 రోజులుగా 50 శాతం కూడా అమ్మకాలు జరగడం లేదని వ్యాపారులు అంటున్నారు. గిరాకీ లేక చికెన్ దుకాణాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. దానికి తోడు రోజూ నగరంలో అక్కడక్కడ కుళ్లిన చికెన్ నిల్వలు బయటపడుతున్నాయి. గురువారం కంటోన్మెంట్ ప్రాంతంలో అధికారుల తనిఖీల్లో సుమారు ఐదు క్వింటళ్ల కుళ్లిన చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో చికెన్ ముట్టుకోవడానికి నగర వాసులు జంకుతున్నారు. హోటల్స్, రెస్టారెంట్లలో కూడా చికెన్ మెనూ ఆర్డర్లు పూర్తిగా తగ్గిపోయాయి. బర్డ్ ఫ్లూ భయంతో ప్రజలు చికెన్‌కు బదులుగా.. మటన్, చేపల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో మటన్, చేపలకు భారీగా గిరాకీ పెరిగింది.




మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య

## బిసి రిజర్వేషన్ అమలుకు చట్టబద్ధత కల్పించాలి

### సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలు నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. శుక్రవారం రోజున పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో బిసి ఐక్య వేదిక హుస్నాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్వహించిన కుల సర్వే ద్వార బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలుకు సహకరించిన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అన్ని రంగాల్లో బిసిలకు న్యాయం జరిగేవిధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కులగణన సర్వేలో పాల్గొని వారి కోసం మళ్లీ అవకాశం కల్పించడం మంచి నిర్ణయమన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ జెఏసి కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, నాయకులు మార్క అనిల్‌గౌడ్, రాజు, పర్ర రాములు, లక్ష్మన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'యుద్ధ భేరి'ని విజయవంతం చేయాలి

### సిపిఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దేశరాజ్




వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎస్ యూనియన్ నేతలు

**హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్దరించాలని దేశవ్యాప్తంగా ఉద్యోగులు ఉద్యమాలు నిర్వహిస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ విధానాన్ని తేవాలని చూస్తుందని సిపిఎస్ యూనియన్ జిల్లా కార్యదర్శి దేవరాజ్ మండిపడ్డారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ మార్చి 2వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే యుద్ధభేరి కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ, పెన్షనర్లు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కెజివిబి, మోడల్ స్కూల్‌లలో ఈ యుద్ధభేరికి సంబందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్‌యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, మల్లిఖర్జున్, ఎల్లయ్య, సత్యనారాయణ, సదాశివ, విద్యాసాగర్, రాజిరెడ్డి, చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

## ఆయిల్ ఫామ్ పంటలపై రైతులు దృష్టి సారించాలి

### ఏడిఏ సంధ్యారాణి



అయిల్ ఫామ్ పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** అధికంగా లాభాలు వచ్చే ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్‌లపై రైతులు దృష్టి సారించాలని ఏడిఏ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండల పరిధిలోని తుజాల్‌పూర్ గ్రామంలో శివంపేట మండలంలోని గంగాయపల్లి గ్రామంలో ఆ గ్రామ రైతుల పంట పొలాల్లో వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ డిపార్ట్మెంట్ అధికారుల ఆధ్వర్యంలో ఆయిల్‌ఫామ్ ప్లాంటేషన్‌లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడిఏ సంధ్యారాణి మాట్లాడుతూ ఈ ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ ఏర్పాటుతో రైతులకు అధికంగా లాభాలు వస్తాయన్నారు. నర్సాపూర్ మండలంలోని తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్ రెండు ఎకరాలలో అలాగే శివంపేట మండలం గంగాయపల్లి గ్రామానికి చెందిన తారాబాయి 10 ఎకరాల పొలంలో ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్లు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. రైతులు ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్లపై దృష్టి సారించి ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏవో దీపిక, శివంపేట ఏవో లావణ్య, ఏ ఈ ఓ రవివర్మ, ఆయిల్ ఫామ్ అధికారి అజయ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు సిద్దం చేయాలి

### ఆర్డీవో మహిపాల్‌రెడ్డి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో, తహశీల్దార్

**నర్సాపూర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** ఈనెల 27న జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికలకు ఏర్పాట్లను సిద్ధం చేయాలని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం నర్సాపూర్ డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగాఆర్డీవో మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని మండల తహశీల్దార్ శ్రీనివాస్ కు సూచించారు. సిబ్బంది మొత్తం ఈ ఎన్నికల నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తిచేయాలని, ఈ ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్ రెడ్డితో పాటు మండల తహశీల్దార్ శ్రీనివాస్, ఆర్ ఐ లు సిద్ధిరాం రెడ్డి, ఫైసల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన చిన్నబోయిని లక్ష్మణ్ ప్రమాదవశాత్తు మరణించగా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ బిసిసెల్ మండల అధ్యక్షుడు, ముదిరాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల కనకయ్య శుక్రవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి మృతికిగల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి సంతాపం వ్యక్తం చేశారు. పేద కుటుంబాలకు బిఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. ఆయనతో పాటు బోయిని స్వామి, కొట్టాల మహేష్‌లు ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

### మైనంపల్లి హనుమంతరావు

### కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న టిఆర్ఎస్ నేతలు



మాజీ ఏఎంసీ చైర్మన్ యాదగిరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

**రామాయంపేట, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** పట్టణంలో శుక్రవారం రాత్రి టిఆర్ఎస్ పార్టీ నాయకులు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా భారీర్యాలీ నిర్వహించారు. మహిళల బోనాలు, యువకుల నృత్యాలు, పాటలతో సిద్దిపేట క్రాస్ రోడ్డు కాంగ్రెస్ పార్టీ జెండాలతో మార్మోగింది. సుమారు వెయ్యి మంది కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజనేయులుగౌడ్ ర్యాలీ వద్దకు చేరుకున్నారు. వెంటనే వారు ఓపెన్‌టాప్ జీపు పైకి ఎక్కి కార్యకర్తలకు, నాయకులకు అభివాదం చేశారు.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న ఏఎంసీ చైర్మన్ మాజీ సరాపు యాదగిరి, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్తాలకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ ర్యాలీ సిద్దిపేట క్రాస్ రోడ్డు తల్లి తెలంగాణ విగ్రహం నుండి బయలుదేరి ఆర్టీసీ బస్టాండు, మెదక్ క్రాస్ రోడ్డు మీదుగా బాలాజీ ఫంక్షన్ హాల్‌కు చేరుకుంది.. అక్కడ కాంగ్రెస్ పార్టీలోకి చేరిన వారందరికీ పార్టీ కండువాలను మైనంపల్లి హనుమంతరావు కప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామాయంపేట అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన టిఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రామాయంపేట మండలంలో కొత్త పాత అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు కలిసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరిన వారు తనకు సుపరిచితులేనని, తెలిపారు.

ఈ కార్యక్రమములో పార్టీ నాయకులు చౌదరి సుప్రభాతరావు, వై.రమేష్‌రెడ్డి, దేమే యాద గిరి, అల్లాడి వెంకటి, దేవుని రాజు, చిలుక గంగాధర్, చింతల యాదగిరి, సరాపు శ్యామ్ కుమార్, అనిల్, చింతల స్వామి, మధునాల స్వామిగౌడ్, ఎనిశెట్టి అశోక్‌గుప్తా, సుంకోజు దామో దర్‌రావు, సంతోష్, చప్పేట ముత్యంరెడ్డి, రావి పల్లి అమరసేవారెడ్డి, సత్యనారాయణరెడ్డి, కొమ్మాట సత్యనారాయణ మధుసూదన్ రెడ్డి, బండారి మహేందర్ రెడ్డి, జిట్టి మారుతి, పంజ మహేందర్, నసీరుద్దీన్, వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్, వెంకటేష్ గౌడ్, ఎదుకని వెంకటేశం, తీగల రాజేందర్ గౌడ్ తో పాటుగా పలువులు పాల్గొన్నారు..

## రైతు బీమాను కూలీలకు వర్తింపజేయాలి

### -డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త):** రైతులకు అమలు చేస్తున్న రైతు బీమా పథకాన్ని కూలీ కుటుంబాలకు కూడా వర్తింపజేయాలని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామానికి చెందిన దళితులైన తండ్రి బండారి మల్లయ్య, కొడుకు రవీందర్‌ల కుటుంబాన్ని డిబిఎఫ్ నేతలు శంకర్, దాసరి ఏగొండస్వామిలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధతో తండ్రి, కొడుకు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. కూలీ కుటుంబాలకు రైతు భీమా పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కూలీ కుటుంబాలకు బీమా సౌకర్యం లేకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి దళిత కూలీ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. మృతుల భార్యలకు వితంతు పెన్షన్ మంజూరు చేయడంతో పాటు రవీందర్ కూతుర్లు స్నేహ, లౌక్య, రుషికల చదువుల బాధ్యతను ప్రభుత్వం చేపట్టాలన్నారు. అలాగే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

## కల నెరవేరాలంటే ఇష్టంతో చదవాలి

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త):** తల్లిదండ్రుల కల నెరవేరాలంటే విద్యార్థులు ఇష్టంతో చదవాలని మోటివేషన్ స్పీకర్ చంటి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మైనార్టీ బాలికల కళాశాలలో స్కిల్ డెవలప్మెంట్ మరియు కెరీర్ గోల్స్‌పై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో మోటివేషనల్ స్పీకర్ చంటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పేదవారు కావచ్చు కానీ చదువుకునే విద్యార్థులు పేదవాళ్లు కాకూడదని, మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కళాశాల జూనియర్ లెక్చరర్ ప్రియదర్శిని మాట్లాడుతూ మహిళలు అనేక రంగాలలో రాణిస్తున్నారని, మీరు ఎంచుకున్న ఆశయాన్ని సాధించే వరకు కష్టపడాలని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసాల బారిన పడవద్దు

### సిఐ సైదా

గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త): ఆన్‌లైన్ మోసాల భారిన ఎవరూ పడవద్దని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా పేర్కొన్నారు. గజ్వేల్ మండలం పిడిచెడ్ గ్రామంలో శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ సైదా మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజల రక్షణ మరియు సెన్సాఫ్ సెక్యూరిటీ గురించి సిసి కెమెరాలు చాలా ముఖ్యమని తెలిపారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఎవరు ఎలాంటి గొడవలకు దిగవద్దని శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని తెలిపారు. గ్రామంలో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

## సిఎం సహాయనిధి వరం

### -కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్చార్జి పామెనా భీమ్‌భరత్

**షాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సిఎం సహాయనిధి వరం వంటిదని కాంగ్రెస్‌పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్చార్జి పామెనా భీమ్‌భరత్ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని లక్మారావుగూడా గ్రామానికి చెందిన అమృతరెడ్డికి మంజూరైన రూ.60000 సిఎం సహాయనిధి చెక్కును భీమ్ భరత్ అందజేసి మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడు తున్న వారికి సిఎం సహాయనిధి వరం వంటిదని పల్లెల్లో ప్రతి ఒక్కరు సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకొని లబ్ది పొందాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా రేషన్ కార్డులను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపల్లెలో కాంగ్రెస్ అభ్యర్థులను అఖండమెజార్టీతో గెలిపిం చుకుందామని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పెంటారెడ్డి, సుభాష్ చంద్రబోస్, పాల్గొన్నారు.

## 17న ఉచిత కంటి వైద్యశిబిరం

**దుద్యాల్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

గీత జ్ఞాన గురుభక్త మండల సహకారంతో మండలకేంద్రంలో ఈనెల 17న ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలో అందుకు సంబంధించిన కరపత్రం విడుదలచేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ సద్గురు బ్రహ్మానందస్వామి ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, ఎం.ఎస్ రెడ్డి లయన్స్ క్లబ్ వారిచే ఉచిత కంటి, సాధారణచికిత్స శిబిరం నిర్వహించ ఎన్నట్లు తెలిపారు. మండలప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేర్గు వెంకటయ్య, కాలిగే రాములు, కొండెవోని రాములు, చెన్నప్ప, నర్సింలు, సత్యనారాయణ, ఖాజ, నరేష్‌గౌడ్, రాజు, రమేష్, శివప్ప, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా ప్రారంభమైన ఆలయ వార్షికోత్సవాలు

**ఆమనగల్లు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:**

ఆమనగల్లుపట్టణ సమీపంలోని అయ్యప్పకొండపైగల శ్రీభవానీరామలింగేశ్వరస్వామి ఆలయ తృతీయవార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 14నుండి 16వరకు మూడురోజులపాటు వార్షిక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయ నిర్మాణకర్త రేగట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలు మొదటిరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టి శ్రీమహాగణపతి, కంకణధారణ, గణపతిహోమం, స్వామి వారి అలంకరణతో గావించారు. శివభక్తులతోపాటు సాధారణ భక్తులు పెద్దసంఖ్యలో ఉత్సవాలకు తరలివచ్చారు. భక్తులతో ఆలయ పరిసరాలు రద్దీగా దర్శనమిచ్చాయి. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాల తోపాటు అన్నప్రసాదము అందజేశారు. కాగా వార్షికోత్సవాల నేపథ్యంలో శ్రీభవానీరామలింగేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించగా, దీపాలవెలుగులతో ఆలయం జిగేల్లున దర్శనమిస్తుంది. ప్రత్యేకపూజలు, హోమాలు, భజనలతో శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మారుమ్రోగిపోయాయి. కార్యక్రమంలో పూజారులు మల్లిఖర్జున్, మహేశ్, అక్షయ్, మల్లిఖర్జున్, రేగట్టి కౌసల్య, చిన్న చంద్రయ్యదంపతులు, శివస్వాములు నాగిళ్ళ శ్రీను, లింగంపల్లి అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, సిద్దూ, గోపాల్, బిట్టిసాయిలు, వెంకట్, గోవర్దన్, శ్రీరామ్, దేవరాజ్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

## బిటి రోడ్ల నిర్మాణం చేపట్టండి

**ఆమనగల్లు, ఫిబ్రవరి14, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని శెట్టిపల్లినుండి సమీపగ్రామాలకు బిటి రోడ్లు మంజూరు చేయాలని ఆగ్రామ మాజీసర్పంచు ఎగిరిశెట్టి గోదాదేవిసత్యం శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగాకలిసి కోరారు. శెట్టిపల్లి నుండి దొడ్లపహాడ్ ఎక్స్‌రోడ్డువరకు మట్టిరోడ్డు ఉందని, వర్షా కాలంలో ఈరహదారి ఇబ్బందిగా మారుతుందన్నారు. రెండు గ్రామాల ప్రజల రాకపోకలతోపాటు సమీపరైతులకు ఇది తీవ్రసమస్యగా ఉంటుందని సత్యం ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే శెట్టిపల్లిగ్రామంనుండి ఫిరోజ్‌నగర్ ఎక్స్‌రోడ్డువరకు కూడా బిటి రోడ్డునునిర్మించి ప్రజలరాకపోకలను సౌకర్య వంతం చేయాలని కోరారు. గ్రామంలో ప్రజాసమస్యల పరిష్కారానికి తోడ్పాటునందించాలని సత్యం అడిగారు. సిసిరోడ్లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణాలుచేపట్టాలని ఆయన పేర్కొన్నారు. శెట్టిపల్లిగ్రామాభి వృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని సత్యం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు.

## ప్రతిముస్లిం అల్లా అడుగుజాడల్లో నడుచుకోవాలి

**ఆమనగల్లు, ఫిబ్రవరి14, ప్రభాతవార్త:**

ప్రతిముస్లిం అల్లా అడుగుజాడల్లో నడుస్తూ పరులహితాన్ని కోరుకోవాలని మౌలానా అబ్దుల్ వహీద్, లతీఫ్‌లు సూచించారు. గురువారంరాత్రి పట్టణంలో జామమసీదు, మహ్మదియా మసీదు, మసీదు హమాదే హిలాల్‌లో ముస్లింసోదరులు షబ్-ఎ-బరాత్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా రాత్రి ఆయా మసీదులలో ముస్లింసోదరులు చిన్నపెద్ద తేడా లేకుండా హాజరై ప్రత్యేక ప్రార్థనలు, మౌలానాలు బయన్ నిర్వహించారు. అనంతరం జాగరణ కార్యక్రమంలో అల్లా, మహ్మద్‌ప్రవక్త సూక్తులు, ఖురాన్ విశిష్టతలను వివరించి జాగారంచేశారు. ఈసందర్భంగా మతగురువులు మాట్లాడుతూ ప్రతిముస్లిం అల్లా సూచించిన మార్గంలో ఆయన అడుగుజాడల్లో పయనించాలన్నారు. నాతే షరీఫ్ వినిపించిన చిన్నారులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం ఆయా మసీదులలో నిర్వహించిన దువా జాగరణ కార్యక్రమంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## సబ్కా మాలిక్ ఏక్ హై..!

**నందిగామ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

నందిగామమండలం చేగూరు శ్రీసాయిబాబా దేవాలయ 16వ వార్షికోత్సవ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకపూజలు చేశారు. ఉమ్మడిమండలాల మాజీజడ్పిటిసి మామిడి శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకలకు సంబంధించి ఎమ్మెల్యే మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికచింతనతో దైవభక్తిని అలవర్చుకో వాలని సూచించారు. సాయిబాబా దీవెనలతో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని వేడుకుంటున్నాట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో మాజీ ఎంపీపీ ఎం శివ శంకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేపల్లె కుమార్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఎం శ్రీనివాస్ గౌడ్, మంకాల శ్రీశైలం, ఆవుల శివ, వెంకట చారి, మంగలి యాదగిరి, నరేష్ పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**షాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని అంతారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుర్వగూడ, సర్దార్‌నగర్, కక్కులూరు, కేసారం, అంతారం, బోడంపహడ్, మన్‌మర్రి, అప్పారెడ్డిగూడలో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమ నించి సహకరించాలని కోరారు.

# వాల్టా చట్టానికి తూట్లు

### యదేచ్ఛగా ఇసుక అక్రమ తయారీ రవాణా పోలీసు టాస్క్ ఫోర్స్ దాడులతో బట్టబయలైన అధికారుల పని తీరు

**సంగారెడ్డి బ్యూరో ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:**

వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసిన వివిధ ప్రభుత్వ శాఖలు, తమకేమీ పట్టనట్లుగా వ్యవహరి స్తుండడంతో కృత్రిమ ఇసుక తయారీ అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతుంది. రెవెన్యూ రవాణా మైనింగ్ శాఖల అధికారులు మొద్దు నిద్రలో ఉండటంతో సంగారెడ్డి నియోజకవర్గంలో కృత్రిమ ఇసుక తయారీ అక్రమ రవాణా అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. గత మంగళవారం సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పెట్, కంది మండలం బ్యాతోల్ గ్రామాల పరిధిలో నిర్వహి స్తున్న ఇసుక ఫిల్టర్లపై జిల్లా టాస్క్ ఫోర్స్ అధికా రుల దాడులలో ఇసుక అక్రమ రవాణా బట్టబ యలైన విషయం తెలిసిందే. టాస్క్‌ఫోర్స్ అధికారులు జరిపిన దాడుల్లో ఇస్మాయిల్ ఖాన్ పేట ఫిల్టర్లలో దాడులు చేసి మూడు హిటాచీలు, రెండు జెసిబి లు, 5 ట్రాక్టర్ ట్రాలీ లు, 10 ట్రాక్టర్ ఇంజన్లు స్వాధీనం చేసుకోగా, బ్యాతోల్ ఫిల్టర్ల వద్ద మూడు హిటాచిలను చేసుకోవడంతోపాటు, మొత్తం 32 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడులలో సుమారు 6 కోట్ల విలువగల ప్రాపర్టీని సీజ్ చేశా మని జిల్లా ఎస్పీ చెన్నూరు రూపేష్ ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లా కేంద్రానికి సమీపంలో కృత్రిమ ఇసుక తయారీ




పోలీసులు స్వాధీనం చేసుకున్న హిటాచీలు( ఫైల్ ఫొటో)

అక్రమ రవాణా జరుగుతు న్నప్పటికీ రెవెన్యూ శాఖ వాల్టా చట్టాన్ని గాలికి వదిలేసింది. మైనింగ్ శాఖ మొద్దు నిద్రలో, ఉండగా రవాణా శాఖ నిద్రావస్థలు ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు సంబంధిత అధికారులు ముడుపుల మత్తులో ఉండటంతో ఇసుక తయారీ రవాణా యదేచ్ఛగా జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



వృక్షార్చన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

## రాష్ట్రాన్ని హరిత రాష్ట్రం చేసిన ఘనత కెసిఆర్‌దే

### -బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త):** తెలంగాణ సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ జోగినపల్లి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో చేస్తున్న వృక్షార్చన కరపత్రాన్ని బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గజ్వేల్ నియోజకవర్గంలో ప్రతి తెలంగాణ బిడ్డ తెలంగాణ ప్రగతి కోసం, మానవ మనుగడ కోసం పచ్చని చెట్లు అవసరమని ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. అందుకోసం గతంలో కెసిఆర్ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని హరిత రాష్ట్రంగా మార్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ జోగినపల్లి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వృక్షార్చన కార్యక్రమం అభినందనీయమన్నారు. 2 కోట్ల 86 లక్షల మొక్కలకు ప్రాణంపోసిన మహనీయుడు కెసిఆర్ అన్నారు. ఫిబ్రవరి 17న కెసిఆర్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి పౌరుడు ఒక్కొక్కరు మూడు మొక్కలు నాటాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెప్యాల రాజేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, గుంటుకు రాజు, మర్కంటి కనకయ్య, అత్తెల్లి శ్రీనివాస్, మామిడి శ్రీధర్, కూరాకుల శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, పనుగట్ల శ్రీనివాస్ గౌడ్, అనిల్ మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ అధికారుల దాడులతో ఇబ్బందులు పడుతున్నాం

### -విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో నర్సారెడ్డికి వినతి



నర్సారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విశ్వకర్మ సంఘం నాయకులు

**గజ్వేల్, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త):** ఫారెస్ట్ అధికారుల దాడులతో ఇబ్బందులు పడుతున్నామని, పొట్టకూటికి రోజువారీగా పనులు చేసుకునే వారమని, తమ సమస్యలను పరిష్కరించాలంటూ శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ కార్పెంటర్ వర్క్ షాపులపై ఫారెస్ట్ అధికారుల దాడులు సరికావని, చిన్న చిన్న దుకాణాలపై ఫారెస్ట్ అధికారులు దాడులు ఆపాలన్నారు. రోజువారి కూలీపై ఆధారపడి కులవృత్తి చేసుకుంటున్న కార్పెంటర్లను భయభ్రాంతులకు గురిచేస్తే ఊరుకునేదిలేదన్నారు. అనంతరం ఎఫ్ఆర్ఓ వినాయక్‌కు ఫోన్‌చేసి వడ్రంగి పని చేసుకునే వారిని ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు గడియారం వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి విఠల్‌చారి, ఉపాధ్యక్షుడు గడియారం వెంకటేశంచారి, కోశాధికారి అరుణోజి లక్ష్మినర్సింహాచారి, గడియారం నాగరాజుచారి, అరుణోజి శ్రీనివాస్‌చారి, పల్లెపహాడ్ మాజీ సర్పంచ్ కొక్కొండ శ్రీనివాస్‌చారి, నర్సింహాచారి, ధర్మయ్యచారి, నారాయణచారి, విశ్వనాథంచారి, మహేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

**మర్కుక్, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని కర్కపట్ల గ్రామంలో ఏఎస్ఐ రవీందర్ సైబర్ నేరాల పట్ల గ్రామస్తులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దని సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహన కలిగివుండాలన్నారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించినట్లయితే వెంటనే డయల్ 100కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## అమర సైనికులకు నివాళులు



అమర సైనికులకు నివాళులర్పిస్తున్న బిజెపి నేతలు

**మర్కుక్, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త):** పుల్వామా ఉగ్ర దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన దినోత్సవం సందర్భంగా మండలకేంద్రం మర్కుక్‌లో బిజెపి ఆధ్వర్యంలో శుక్రవారం అమర సైనికుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు చేసిన త్యాగానికి దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు రమేష్, నాయకులు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మర్కుక్ పాఠశాలను ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

**మర్కుక్, ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త):** మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పరీక్షల సమయంలో ఏవిధంగా ప్రిపేర్ కావాలో విద్యార్థులకు సూచించారు. అలాగే పాఠశాలలో కలియతిరిగి విద్యాబోధన పట్ల, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పాఠశాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మర్కుక్ తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రకళ


విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా కోర్టులో అడిషనల్ న్యాయవాది హర్షపై చెప్పు విసిరి దాడి చేసిన జీవిత ఖైదు శిక్ష పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని నారాయణఖేడ్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలలో న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర బార్ అసోసియేషన్ పిలుపు మేరకు న్యాయవాదులు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రదాన కార్యదర్శి లక్ష్మణ్‌రావు, ఉపాధ్యక్షులు భోజిరెడ్డి, ఏజిపి సాయిలు, న్యాయవాదులు భువనేశ్వరి, సంగమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్ల అరాచకాలు ఆపాలి : అశోక్


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సిహెచ్ అశోక్

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులపై అరాచకాలను ఆపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సిహెచ్ అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో అశోక్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం విద్యార్థులపై మానసికంగా ఒత్తిడి పెంచుతున్నారని, ఫీజులు విషయంలో తల్లిదండ్రులతో మాట్లాడాలి కాని విద్యార్థులతో చర్చించడం ఏమిటని ప్రశ్నించారు. ఫీజులు కట్టకపోతే విద్యార్థులను పాఠశాల బయట ఎండలో నిలబెతుతున్నారని, తోటి విద్యార్థుల ముందు అవమానాలకు గురవుతారన్న విషయాన్ని యాజమాన్యాలు గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రైవేటు పాఠశాలలు, యాజమాన్యాల అరాచకాలను ఇకనైనా ఆపాలని అశోక్ డిమాండ్ చేశారు. అరాచకాలు ఆపకుంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నిఖిల్, అఖిల్, ప్రవీణ్, వరుణ్, దిలీప్ పాల్గొన్నారు.

## ఉజ్జంపాడ్‌లో బిజెపి ఎన్నికల ప్రచారం


పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న బిజెపి నేతలు

**సిర్గాపూర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఉజ్జంపాడ్ గ్రామంలో శుక్రవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని భారతీయ జనతా పార్టీ నాయకులు నిర్వహించారు. గ్రామంలోని పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్సీ అభ్యర్థి సి.అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి మద్దతు పలకాలని రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు అరుణ్‌రాజ్ శేరికార్, జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, నారాయణఖేడ్ మండల అధ్యక్షులు దశరథ్, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్‌లు వినతి చేశారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



సిర్గాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో స్వయంపాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**సిర్గాపూర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపనాల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా బి.స్వాతి, కలెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్ రాథోడ్, ఆర్‌జెడిగా ముత్యపు సాక్షి, డిఈఓగా అవిటి శ్రీలత, డిప్యూటీ ఈఓగా హాసిన, ఎంఈఓగా మోహన్ జాదవ్, ఉపాధ్యాయులుగా అశోక్, ప్రేమ్‌దాస్, జ్ఞానేశ్వర్, తానాజీరావ్, అభిలాష్, కె.వెంకట్, శిరీష, రసజ్ఞ, సుప్రయ, సంగీత, పిడిలుగా ప్రవల్లిక, విజయసాగర్, పిఈటిలుగా బి.కుమార్, చింటూ, భానుప్రయ వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ చాటి విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

## ఎల్ఓసి అందచేజేసిన ఉమాదేవి శెట్కార్

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** జుక్కల్ నియోజకవర్గానికి చెందిన షేక్ రహిమాన్ అనారోగ్యానికి గురైనట్లు తెలుసుకున్న ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకంలో 2.5 లక్షల రూపాయలను మంజూరు చేయించగా శుక్రవారం ఎంపి సురేష్‌కుమార్ ధర్మపత్ని ఉమాదేవి శెట్కార్ బాధితుడికి ఎల్ఓసిని అందచేశారు. ఎల్ఓసి అందుకున్న షేక్‌రహిమాన్ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎంపి సురేష్ కుమార్ శెట్కార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## నారాయణఖేడ్‌లో గిరిజనుల ర్యాలీ

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం బంజార సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో మంగల్‌పేట్ దుర్గ భవాని ఆలయం నుంచి రాజీవ్ గాంధీ చౌరస్తా, శివాజీ చౌక్‌ల మీదుగా సేవాలాల్ చౌక్ వరకు గిరిజనులు బోనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్‌లు మాట్లాడుతూ గిరిజనులు సేవాలాల్ దీక్షను చేపట్టి భక్తి శ్రద్ధలతో కఠోర నియమాలతో రోజులు గడపడం శుభపరిణామమన్నారు. ఉత్సవాలకు చేరుకున్న గిరిజనులకు పట్టణంలోని మహా ఫంక్షన్ హాల్‌లో బంజారా నాయకులు మహా భోగ్ బండార్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్ చౌహాన్, బంజారా నాయక్ కార్బారి పూజారులు, ఉద్యోగ సంఘాలనేతలు, రాజకీయనాయకులు పాల్గొన్నారు.


నారాయణఖేడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

# విజయవంతంగా ముగిసిన అంతర్జాతీయ సదస్సు

### ఆలోచింపజేసిన దేశ, విదేశీ నిపుణుల ప్రసంగాలు.. భవిష్య సవాళ్లపై లోతైన అవగాహన


సదస్సులో ప్రపంచంలోని వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు, సైంటిస్టులు

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ, హైదరాబాదులో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు 'ఫార్మాస్యూటికల్, ఆరోగ్య శాస్త్రాలలో సమగ్ర ధోరణులు' అనే అంశంపై నిర్వహించిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం విజయవంతంగా ముగియడమేగాక, ప్రపంచ ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగంలో చెరగని ముద్ర వేసింది. డాక్టర్ రెడ్డీస్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల వెంకటేశ్వర్లు, కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ(సీడీఎస్ సీవో) డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎ.రామ్‌కిషన్ తదితరులు సదస్సును ప్రారంభించారు. తొలిరోజు డాక్టర్ రెడ్డీస్ సీనియర్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ పరిమళ్ మిశ్రా, నైపర్ హైదరాబాద్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాస్ నండూరి, పంజాబ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు వినోద్‌కుమార్, రాజ్ కుమార్, క్రొయేషియాలోని సెంటర్ ఫర్ ఇన్ఫర్మేటిక్స్ శాస్త్రవేత్త డాక్టర్ జురికా నోవాక్ ఆలోచింపజేసే ప్రసంగాలు చేశారు. రెండో రోజు మలేషియాలోని ఐఎంయూ వర్సిటీకి చెందిన డాక్టర్ త్యాగరాజన్ మాధేశ్వరన్, బిట్స్ పిలానీకి చెందిన ప్రొఫెసర్ అనిల్‌కుమార్, అమెరికాలోని చాప్ మన్ వర్సిటీ ప్రొఫెసర్ కెపరాంగ్, శ్రీలంకలోని వాయంబా విశ్వ విద్యాలయం నుంచి ప్రొఫెసర్ ఎస్.జీవతయపరన్, కాలిఫోర్నియాలోని సైట్‌ఎక్స్ థెరప్యూటిక్స్ నుంచి డాక్టర్ రాఘవ శ్రీరమణేని నేతృత్వంలో ఆకర్షణీయమైన చర్చలు జరిగాయి. ఇక చివరి రోజున, ఈ సదస్సు ఐఈఎఫ్ఆర్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఉదయ్ సక్సేనా, ఎన్వేద థెరప్యూటిక్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీకాంత్ రామచంద్రన్, దక్షిణ కొరియా నుంచి ప్రొఫెసర్ గంగరాజు గెడ్డా, పూణే నుంచి ప్రొఫెసర్ చిన్మోయ్‌పాత్రావంటి ప్రఖ్యాత నిపుణులు ఆరోగ్య సంరక్షణ, ఔషధ ఆవిష్కరణల భవిష్యత్తుపై అద్భుతమైన అంతర్దృష్టులను పంచుకున్నారు. ఈ సదస్సు నిర్వాహకుడు డాక్టర్ ప్రతీక్ పాఠక్ మాట్లాడుతూ, ఇందులో 60కి పైగా మౌఖిక ప్రదర్శనలు, వందకుపైగా పోస్టర్ ప్రదర్శనలు, 15 మంది నిపుణుల ఉపన్యాసాలు జరిగినట్టు తెలిపారు. విద్యా, శాస్త్రీయ అంశాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రపంచ జ్ఞాన సమ్మేళనంగా నిలిచిన ఈ సదస్సులో అమెరికా, క్రోయేషియా, మలేషియా, శ్రీలంక, దక్షిణ కొరియా, భారతదేశం నుంచి విభిన్న శ్రేణి వక్తలు పాల్గొన్నారని డాక్టర్ ప్రతీక్ తెలిపారు. మూడు వేర్వేరు దేశాలతో పాటు మనదేశంలోని ఆరు రాష్ట్రాల నుంచి 450 మంది హాజరైన ఈ సదస్సులో ఆరోగ్య సంరక్షణ, ఔషధ పురోగతిపై సార్వత్రిక ఔచిత్యాన్ని, పెరుగుతున్న ఆసక్తిని నొక్కి చెప్పిందన్నారు. ఈ అంతర్జాతీయ సహకారం గొప్ప చర్చలు, కొత్త ఆలోచనలు, పరిశ్రమ భవిష్యత్తును రూపొందించే సవాళ్లు, అవకాశాల గురించి లోతైన అవగాహనను పెంపొందించినట్టు పేర్కొన్నారు. అంతేగాక, జ్ఞానాన్ని పంచుకోవడానికి, ఆలోచనల మార్పిడికి, ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తును రూపొందించే సహకారాలను పెంపొందించడానికి ఒక పరివర్తన వేదికగా తోడ్పడినట్టు ప్రతీక్ వివరించారు. సదస్సు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. చివరిగా, ఓరల్, పోస్టర్ ప్రజెంటేషన్ విజేతలకు బహుతులు, వారిని ఎంపిక చేసిన ప్యానల్ కు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

## అభివృద్ధి కోసమే అధికార కాంగ్రెస్ పార్టీలో చేరాం

### ఎంసి మాజీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, మాజీ కౌన్సిలర్ గజవాడ నాగరాజుగుప్తా

**రామాయంపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** అభివృద్ధి కోసమే టిఆర్ఎస్ పార్టీని వీడి, అధికార కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు రామయంపేట ఏఎంసీ మాజీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ గజవాడ నాగరాజుగుప్తా తెలిపారు. శుక్రవారం సాయంత్రం వారు మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా చేరినతర్వాత జరిగిన సభలో మాట్లాడారు.. కేవలం రామాయంపేట అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యపడుతుందన్న నమ్మకంతో ఆ పార్టీలో చేరినట్లు తెలిపారు. అభివృద్ధి చెందాలన్నదే తమ ఉద్దేశమని, అంతేగాని ఎలాంటి స్వార్థంతో కాంగ్రెస్ పార్టీలో చేరలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న కార్యకర్తలను, నాయకులను, ప్రజా ప్రతినిధు లను అందరిని కలుపుకొనిపోయి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంటామని వారు ధీమా వ్యక్తం చేశారు..వీరివెంట కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మాజీ కౌన్సిలర్లు సరాఫ్ సౌభాగ్య శ్యామ్‌సుందర్, చింతల రాధా భవానియాదగిరి, బొర్రా అనిల్‌కుమార్‌తోపాటు యువజన నాయకులు చింటు, మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షులు అల్లాడి నారాయణ, నాయకులు పుట్టి రాములు ముదిరాజ్, జొన్నల బాలు, మధునాల స్వామిగౌడ్, చిలుక ఎల్లయ్య ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ చంద్రపు నాగేశ్వర్ రెడ్డి, ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు పోచ మ్మల సిద్ధరాములు, అస్లాం, ముబీన్, ఇర్షద్, పోచ మ్మల స్వామిముదిరాజ్, శీలం నర్సింహారెడ్డి, పుట్టి సాయిలు, కరెంటు గణేష్, ఎర్రగొల్ల. రాములు, ఎర్రగొల్ల. సత్యం, ఎర్రగొల్ల. మహేష్, మర్కు భూపాల్, పోచమ్మల నారాయణ, మ్యాకల యాద గిరి, భూమ సిద్ధిరాములు, జలగడుగుల గంగారాం, డాకి నర్సింలు, పోచమ్మల ప్రసాద్,జావీద్, సమీర్, ముక్తర్, జాఫర్, ఆటో సత్యం, ఆటో కృష్ణ, ప్లంబర్ మల్లేశం, వడ్డే శేఖర్, కొక్కు ప్రవీణ్, దామర చెరువు మాజీ సర్పంచి పిట్ల యాదగిరి ఉన్నారు.

## ఆలయ పునఃప్రతిష్ఠాపన పూజలు ప్రారంభం


ప్రసన్నాంజనేయాలయ పునఃప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాల దృశ్యం

**పాపన్నపేట, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పునఃప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు శుక్రవారం నేత్ర పర్వంగా ప్రారంభించారు. భక్తి శ్రద్ధలతో గణపతి పూజ, యాగశాల ప్రవేశం తదితర పూజా కార్యక్రమాలు వేద బ్రహ్మణులు వేద మంత్రాలు వల్లిస్తుండగా నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. శనివారం, ఆదివారం ఆలయంలో పూజలు, ప్రాణ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటి బాధ్యులు పేర్కొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి తీగలు, ఆయిల్ చోరీ..

**వెల్దుర్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తి వైకుంఠధామం పరిసరాల్లో ఎన్. శ్రీనివాస్ గౌడ్ పొలం ప్రక్కన గల విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పగలగొట్టి ట్రాన్స్ ఫార్మర్‌లో ఉన్న తీగలను, ఆయిల్‌ను దొంగలించారు. ట్రాన్స్ ఫార్మర్‌ను పగలగొట్టగా విడిపోయిన భాగాలను ప్రక్కనే పొలంలో పడవేశారు.

## మంబాపూర్‌లో ఎక్స్‌రే క్యాంపు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** క్షయ వ్యాధి రహిత గ్రామం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుమ్మడిదల మండలం మంబాపూర్ గ్రామ పంచాయతీలో ఎక్స రే క్యాంపు నిర్వహించడం జరిగింది. ఇందులో 70 మందికి పరీక్షలు నిర్వహించగా, 10 మందికి క్షయవ్యాధి లక్షణాలు ఉన్నట్లు నిర్ధారించడం జరిగిందని, వారికి తెమడ పరీక్ష చేసి చికిత్స ప్రారంభించడం జరుగుతుందని మండల వైద్యాధికారి మధుకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో శ్రీనివాస్, దేవేందర్, కృష్ణ, టీబీ జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ శివ, టెక్నీషియన్, ఎంఎల్‌హెచ్‌పీ కళ్యాణి, శంతన, ఏఎన్ఎం ఎస్తేర్, మంజుల, జ్యోతి, మరియమ్మ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలలో బోధనా తీరును పరశీలిస్తున్న డిఇవో రాధాకిషన్

## పదిలో మంచి ఫలితాలు సాధించాలి

### డిఇవో రాధాకిషన్

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** పదవతరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులను అన్నివిధాలుగా సన్నద్ధం చేయాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండల పరిధి మిర్జాపల్లి, మడూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పదవతరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడి లోనుకావద్దని సరైన ప్రణాళికలను ఏర్పాటు చేసుకొని చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చున్నారు. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ వహిచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి 100 శాతం మంచి ఫలితాలు సాధించాలన్నారు. అంతకు ముందు గజగట్లపల్లి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే తీరును పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట ఏఎంవో సుదర్శన్, ప్రధానోపాధ్యాయులు గాలయ్య ఉన్నారు.

## రాధమ్మ సాంగ్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే


సూడె పిల్లో రాధమ్మ యూట్యూబ్ ఫోక్‌సాంగ్‌ను ఆవిష్కరిస్తున్న సునీతరెడ్డి

**నర్సాపూర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** నర్సాపూర్ గ్రామీణ ప్రాంతానికి చెందిన ఎన్ శ్రీశైలం పాటను రచించి రూపొందించి స్థానిక కళాకారుల చేత రాధమ్మ అనే ఫోక్ సాంగ్‌ను రూపొందించడం అభినందనీయమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం మ్మెల్యే నివాసంలో సిరిమువ్వలు యూట్యూబ్ ఛానల్ బ్యానర్‌పై రూపొందించిన సుదు సుడే పిల్లో రాధమ్మ అనే యూట్యూబ్ ఫోక్ సాంగ్ ప్రోమోను ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో సోషల్ మీడియా యూట్యూబ్‌లాంటి చానల్స్ ఎంతగానో ప్రాచుర్యం పొందుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం పాటలను చిత్రీకరించి ప్రజల్లో ఆదరణ పొంది నర్సాపూర్ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు బాబ్యా నాయక్,సామ్యానియక్, ధన్‌సింగ్,,శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ గౌడ్ వెంకటేష్, సూరారం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

### కాంగ్రెస్ సేవదళ్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్

చిన్నకోడూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :

క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయని మండల కాంగ్రెస్ సేవదళ్ అధ్యక్షులు అరకాల శ్రీకాంత్ యాదవ్ అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన యువకులకు గ్రామ వాలీబాల్ టీంకు తన స్వంత ఖర్చులతో టీ షర్టు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యువకుడు క్రీడ పోటీలలో పాల్గొని రాణించాలన్నారు. గ్రామ యువకులు ఐక్యమత్యంగా ఉండి గ్రామ అభివృద్ధికి సహకరించాల్సి న అవసరం ఎంతైనా ఉందన్నారు. తన వంతుగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. వాలీబాల్ టీం సభ్యులు శ్రీకాంత్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# టేక్మాల్ సహకార సంఘంలో అవినీతి : కాంగ్రెస్


మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ నాయకులు

**టేక్మాల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :**

టేక్మాల్ ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన అవినీతిపై ఉన్నతాధికారుల విచారణలో రూ.21, 34,933 అవినీతి జరిగినట్లు తేలిందని కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపించింది. శుక్రవారం టేక్మాల్‌లో వారు మాట్లాడుతూ వేణుగోపాల్ సెక్రటరీ ప్రెసిడెంట్ పై మోపబడిన ఆరోపణలపై చట్టం 1964 51 చట్టబద్ధమైన విచారణ ఆదేశించారన్నారు. దీనికి బాధ్యులైన సొసైటీ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, సీఈఓ వేణుగోపాల్ తక్షణమే రాజీనామా చేసి కాజేసిన సొమ్మును మిత్తితో సహా సహకార సంఘానికి చెల్లించాలని కాంగ్రెస్ మండల కమిటీ డిమాండ్ చేసింది. కరుణాకర్, డిప్యూటీ రిజిస్ట్రార్/విచారణ అధికారి, ఈ విచారణను ప్రోగ్స్ ద్వారా నిర్వహించేందుకు అధికారం ఇచ్చారు. దీంతో విచారణ అధికారి విచారణ జరిపి నివేదిక సమర్పించినట్లు వారు చెప్పారు. ఎంక్వయిరీ రిపోర్ట్‌లో నివేదించిన విషయాలు ఈకింది విధంగా ఉన్నాయన్నారు. పెట్రోల్ బంక్ నిర్మాణం సెక్షన్ 51 టీసీఎస్ యాక్ట్ 1964 కింద విచారణ సందర్భంగా అందుబాటులో ఉన్న డాక్యుమెంట్లు, రిజిస్టర్, డేబుక్, పెట్రోల్‌బంక్ నిర్మాణానికి అనుమతి ఇంజనీర్ ఇచ్చిన ఎంబీ రికార్డులను తనిఖీ చేసి బిల్లులు, ఇన్‌వాయిస్‌లు, తదితరాలను తనిఖీ చేసినట్లు విచారణ అధికారి నివేదించిందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి సంపాదించిన రైతుల సొమ్మును అభివృద్ధి పేరుతో దోచుకున్నారని ఆరోపించారు. అవినీతి జరిగినట్లు రుజువైన పక్షంలో ముక్కు నేలకు రాస్తానని గతంలో చైర్మన్ చేసిన సవాలకు కట్టుబడి ఉండాలని, ముక్కు నేలకు రాసి రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్ నాయకులు మాని కిషన్, యూసుఫ్, సొసైటీ డైరెక్టర్లు పాపయ్య,నరసింహారెడ్డి, సత్యం, శ్రీరాములు, నరేందర్, మంగమ్మ, కిష్టయ్య, లక్ష్మీ, మల్లేశం, నాయకులు మజర్, కిషోర్, శ్రీధర్ చారి, భూంరెడ్డి, అశోక్ రెడ్డి,విద్యాసాగర్, మల్లేశం,రాజేష్‌గౌడ్, శివగౌడ్, సాయిశేషు తదితరులు పాల్గొన్నారు.


సహకార నిధి డిపాజిట్ పథకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## సహకార నిధి డిపాజిట్‌పై అవగాహన

**మనూర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** మండలకేంద్రంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ నారాయణఖేడ్ ఆధ్వర్యంలో ప్రజలకు సహకార నిధి డిపాజిట్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిసిసిబి మేనేజర్ వెంకటేశం, పీల్డ్ ఆఫీసర్ యాకుబ్, సెక్రెటరీ జనార్దన్, నారాయణఖేడ్, మనూర్ సొసైటీ కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బంగారు ఆభరణాలను భద్రపర్చుకోవటానికి లాకర్ సదుపాయం కల్పించామన్నారు. ఫిక్స్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లపై అత్యదిక వడ్డీ వస్తుందన్నారు. సహకార బ్యాంకుల్లో ఫోన్ పే, గూగుల్ పే, యూపీఐ లాంటి సదుపాయాలు ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంత రైతులకు వ్యవసాయ రుణాలు, డైరీ, ఫౌల్ట్రీ,, ఫిషరీ, షిప్, రైతు నేస్తం, ల్యాండ్ డెవపల్‌మెంట్, వ్యవసాయేతర రుణాలు (బిజినెస్ రుణాలు), హౌజింగ్ రుణాలు, విద్య రుణాలు సైతం అందిస్తామన్నారు. ప్రజలు బ్యాంక్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## మండల సమాఖ్య కార్యవర్గ సభ్యుల సమావేశం

**మనూర్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శుక్రవారం మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులతో అదికారులు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. సమావేశానికి మండలంలోని 21 గ్రామ సంఘాల అధ్యక్షులు, గ్రామ సంఘాల విఓఎలు, జెండర్ సబ్ కమిటీ సభ్యులు హాజరు కాగా ఆరోగ్యం, పరిశుభ్రత, న్యూట్రేషన్, ఆహారం తదితర అంశాలపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మీనా, ఇందిరాక్రాంతి పథకం ఏపిఎం కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఓ ప్రభాకర్, డిహెచ్ఈబ్లు నర్సింలు, సిసిలు సంజీవ్, అకౌంటెంట్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై మహిళా సంఘాలు కృషి చేయాలి

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** మహిళా సంఘాలు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిని సారించాలని ఇందిరా క్రాంతి పథకం ఏపిఎం చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం నాగల్‌గిద్దలోని ఐకెపి కార్యాలయంలో మహిళా సంఘాల సమైఖ్య సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఐకెపి సిబ్బంది గురుస్వామి, రవి తుకారాం, సాయిలు, ఆయా గ్రామాల మహిళా సమాఖ్య సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

## ఎల్ఓసి అందచేసిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** పట్టణంలోని 5వ వార్డుకు చెందిన కొల్ల లక్ష్మయ్యకు ప్రమాదావశాత్తూ తలకు గాయమై అనారోగ్యానికి గురైనట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకంలో రూ. 2 లక్షల ఎల్ఓసిని మంజూరు చేయించి శుక్రవారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో 5వ వార్డు బిఆర్ఎస్ అధ్యక్షులు విశ్వేశ్వర్, నాయకులు బరూర్ దత్తాత్రి ముదిరాజ్, యం నర్సింలు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అందచేయాలి : బిఆర్ఎస్


డబుల్ బెడ్‌రూం ఇండ్లను సందర్శిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**జహీరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హోతి(కె) గ్రామ శివారులో 10 ఎకరాల ప్రభుత్వ భూమిలో 36 కోట్ల రూపాయలతో నిర్మించిన 660 డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్దిదారులకు వెంటనే అందచేయాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు డబుల్ బెడ్‌రూంను పరిశీలించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా లాటరీ పద్దతితో లబ్దిదారులను గతంలోనే ఎంపికచేసి పట్టాలను అందచేశారని గుర్తు చేశారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి ఎంపిక చేసిన లబ్దిదారులకు అందచేయాలని లేనిఎడల బిఆర్ఎస్ ఆధ్వర్యంలో లబ్దిదారులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షులు మహమ్మద్ యాకూబ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండిమోహన్, మాజీ కౌన్సిలర్ అబ్దుల్లా, పట్టణ మహిళా అధ్యక్షురాలు మంజుల, విద్యార్థి విభాగం అధ్యక్షులు రాకేష్, నాయకులు ప్రభుయాదవ్, గణేష్, నరేష్‌రెడ్డి, జాకీర్ పాల్గొన్నారు.

## బకాయి వేతనాలు వేతనాలు వెంటనే చెల్లించాలి



సిడిపిఓకు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**జహీరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** ఐసిడిఎస్‌లో పనిచేస్తున్న అంగన్‌వాడి టీచర్లకు, హెల్పర్లకు డిసెంబరు, జనవరి నెలల వేతనాలు వెంటనే అందచేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సిడిపిఓకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాజెక్టులో పనిచేస్తున్న టీచర్లకు, హెల్పర్లకు మాత్రమే బ్యాంక్ సమస్యలు వస్తున్నాయనే కారణంతో వేతనాలు అందచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని లేకుండా ఆందోళన తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. సోమవారం వరకు బకాయి వేతనాలు అందచేస్తామని సిడిపిఓ హామి చేశారని, హామిని అధికారులు నెరవేర్చకుంటే చలో కమిషనరేట్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియర్ (సిఐటియు) జహీరాబాద్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి నాగమణి, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, సహాయ కార్యదర్శి గౌరమ్మ, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫాంతో అధిక లాభాలు

**నర్సాపూర్ రూరల్, ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:**

ఆయిల్ ఫాంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని నర్సాపూర్ వ్యవసాయ సహాయ సంచాలకులు సంధ్యారాణి, మండల వ్యవసాయాధికారి దీపికలు అన్నారు. శుక్రవారం నాడు మండల పరిధిలోని తుజాల్‌పూర్ గ్రామ రైతు శ్రీనివాస్ రెండు ఏకరాలలో ఆయిల్ ఫాం మొక్కలను నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆయిల్ ఫాం సాగుకు తక్కువ పెట్టుబడి అవసరమవుతుందని, ఇతర పంటలతో పోలిస్తే నికర లాభం ఎక్కువ అని అన్నారు. రైతులు ఆయిల్‌ఫాం సాగుకు ముందుకు రావాలని కోరారు. రైతులు పాల్గొన్నారు.